# హెబ్రీయులకు వ్రాసిన పత్రిక

# 4వ అధ్యాయము

### ప్రధాన యాజకుడైన క్రీస్తు – ఆయన అహరోను కంటె శ్రేష్ఠుడు

ఆయన యొక్క విశ్రాంతిలో ప్రవేశించుదుమను వాగ్దానము ఇంక నిలిచియుండగా, మీలో ఎవడైనను
ఒకవేళ ఆ వాగ్దానము పొందకుండ తప్పిపోవునేమో అని భయము కలిగియుందుము. 2 వారికి
ప్రకటింపబడినట్లు మనకును సువార్త ప్రకటింపబడెను, గాని వారు వినిన వారితో విశ్వాసము గలవారై
కలిసియుండలేదు గనుక విన్న వాక్యము వారికి నిష్ప్రయోజనమైనదాయెను. 3 కాగా జగత్పునాది
వేయబడినప్పుడే ఆయన కార్యములన్నియు సంపూర్తియై యున్నను, ఈ విశ్రాంతిని గూర్చి – నేను కోపముతో
ప్రమాణము చేసినట్టు వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరు అని ఆయన చెప్పిన మాట అనుసరించి
విశ్వాసులమైన మనము ఆ విశ్రాంతిలో ప్రవేశించుచున్నాము. 4 మరియు – దేవుడు ఏడవ దినమందు తన
కార్యములన్నిటిని ముగించి విశ్రమించెను అని ఏడవ దినమును గూర్చి ఆయన యొకచోట చెప్పియున్నాడు. 5
ఇదియునుగాక ఈ చోటుననే – వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరు అని చెప్పియున్నాడు. 6 కాగా ఎవరో
కొందరు విశ్రాంతిలో ప్రవేశించుదురను మాట నిశ్చయము గనుకను, ముందు సువార్త వినినవారు
అవిధేయతచేత ప్రవేశింపలేదు గనుకను, 7 నేడు మీరాయన మాట వినినయెడల మీ హృదయములను
కఠినపరచుకొనకుడని వెనుక చెప్పబడిన ప్రకారము, ఇంతకాలమైన తరువాత దావీదు గ్రంథములో – నేడని
యొక దినమును నిర్ణయించుచున్నాడు. 8 యెహోషువ వారికి విశ్రాంతి కలుగజేసిన యెడల ఆ తరువాత
మరియొక దినమును గూర్చి ఆయన చెప్పకపోవును. 9 కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది. 10
ఎందుకనగా, దేవుడు తన కార్యములను ముగించి విశ్రమించిన ప్రకారము, ఆయన యొక్క విశ్రాంతిలో
ప్రవేశించినవాడు కూడ తన కార్యములను ముగించి విశ్రమించును.

### యేసు అను గొప్ప ప్రధానయాజకుడు మనకున్నాడు

11 కాబట్టి అవిధేయతవలన వారు పడిపోయినట్లుగా మనలో ఎవడును పడిపోకుండ ఆ విశ్రాంతిలో
ప్రవేశించుటకు జాగ్రత్త పడుదము. 12 ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల
ఎటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంత మట్టుకు
దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది. 13 మరియు ఆయన దృష్టికి
కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క అప్పచెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు
సమస్తమును మరుగు లేక తేటగా ఉన్నది. 14 ఆకాశమండలము గుండా వెళ్లిన దేవుని కుమారుడైన యేసు
అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. 15
మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త
విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను, 16 గనుక మనము
కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు
చేరుదము.